క్లుప్తంగా

కృతజ్ఞతలు

బాడంగి: కోడూరుమాత యాత్రను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు కోడూరుమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ పి.యుగల్‌కుమార్ తెలిపారు. పుణ్యక్షేత్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది సహకరించారన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



సంకిలిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

రేగిడి: మండలంలోని రేగిడి, ఆమదాలవలస, సంకిలి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో తలెత్తే సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నారు. మరోవైపు గ్రీన్‌అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి, చెత్తను సేకరించి, డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు.

ఘనంగా బంగారమ్మ ఆలయ ప్రారంభోత్సవం

బాడంగి: మండలంలోని చినభీమవరంలో బంగారమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు చందాలు పోగుచేసుకుని ఆలయం నిర్మించారు. అర్చకుడు ఆయపిళ్ల రామశాస్త్రి మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చప్ప తిరుపతినాయుడు, లచ్చుపతుల అప్పలనాయుడు, దాలి నాయుడు, తిరుపతి, తెర్లి శ్రీనువాసరావు, చినభీమవరం, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



వన్నలి గ్రామంలో రైతులతో ఈకేవైసీ చేయిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని ప్రతీరైతు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఆదివారం పరిశీలించిన ఆయన పండించిన ప్రతీ పంటను రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించాలనుకుంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు.

ఆర్‌బీకేలకు చేరిన యూరియా



సోమరాజుపేట ఆర్‌బీకే వద్ద అన్‌లోడ్ చేస్తున్న యూరియా బస్తాలు

రేగిడి: మండలంలోని చాటాయవలస, సోమరాజుపేట, అంబకండి తదితర గ్రామాల్లోని ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)లకు రైతులకు అవసరమైన యూరియా బస్తాలు చేరుకున్నాయి. ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఎరువులను అన్నదాతలకు అందుబాటులో ఉంచుతున్నట్లు మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు.

చట్టం ముందు అందరూ సమానమే..

● ఎమ్మెల్యే శంబంగి



ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన మాజీ సీఎం చంద్రబాబు బెయిల్‌పై వచ్చేస్తారని పలువురు ప్రచారం చేసినా.. కోర్టు రిమాండ్ విధించిందని.. చట్టం ముందూ అందరూ సమానమేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అతిపెద్ద స్కామ్ చేసి చట్టానికి అతీతుడిగా తన ప్రచారంతో పబ్బం గడుపుకుంటున్న చంద్రబాబు అసలు రంగు కోర్టులో తేలుతుందన్నారు. బలమైన సాక్ష్యాల ఆధారంగా న్యాయదేవత నిందితులకు శిక్ష వేస్తుందని చెప్పారు.

మట్టి మేలు తలపెట్టవోయ్..

- మట్టి విగ్రహాలే ముద్దు.. పీవోపీ విగ్రహాలు వద్దు..
- వినాయక చవితి వేళ మట్టి విగ్రహాలు వాడాలని కోరుతున్న పర్యావరణ ప్రేమికులు
- ఈ నెల 18న వినాయక చవితి
- పల్లెలు, పట్టణాలు, నగరాల్లో సిద్ధం చేస్తున్న మండపాలు
- విక్రయానికి సిద్ధంగా గణేశుని భారీ ప్రతిమలు



పంపిణీకి సిద్ధం చేసిన మట్టివిగ్రహాల అచ్చులు చూపుతున్న వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: వినాయక చవితి అనగానే చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరికీ సరదా తెచ్చే అత్యంత ఇష్టమైన పండగ. ఎంత దూరంలో ఉన్నా సొంత ఊరిలో జరిగే వినాయక చవితి వేడుకలకు పట్టణాల నుంచి యువకులు తరలిరావడం, మండపాలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తుంటారు. చవితి తొలిరోజు మొదలుకుని, నిమజ్జనోత్సవం వరకు వేరే పనులకు వెళ్లకుండా గణేశుని మండపం వద్దే సందడి చేస్తూ ఉంటారు. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి కావడంతో ఊరువాడా అంతా సందడి వాతావరణం నెలకొంది. మండపాలు ఏర్పాటు దగ్గర నుంచి విగ్రహాల ప్రతిష్ట వరకు అన్ని రకాల చర్యలకు ప్రణాళికలు రచిస్తున్నారు. పట్టణాలు, పల్లెల్లో వీధివీధినా గణనాథులు కొలువుదీరనున్నారు. అయితే ఈ ఉత్సవాల్లో మట్టి గణపతులనే వినియోగించి, పర్యావరణానికి మేలు చేయాలని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు కోరుతున్నారు. దీనిపై పల్లెలు, పట్టణాలు, నగరాల్లో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా, వినాయక చవితి పండగ ఎంతోమంది చేతివృత్తులు, కళాకారులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది.

మండపాల తయారీ..

ఈ నెల 18న జరిగే వినాయక చవితి పండగకు అందరూ సిద్ధమవుతున్నారు. పట్టణాలకు దీటుగా గ్రామాల్లోని యువకులంతా ఈ ఏడాది వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే మండపాల తయారీలో నిమగ్నమయ్యారు. భారీ సైజుల్లో బొమ్మలు కొనుగోలు చేసి, వేడుకగా నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏడాదికేడాది రెట్టింపు ఉత్సాహంతో పెద్దసైజులో పీఓపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాలు కొనుగోలు చేస్తున్న యువత ఈ ఏడాదైనా మట్టి విగ్రహాలను వాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

మట్టి ప్రతిమలనే పూజించాలి..

అనాదిగా వస్తున్న ఆచార, సంప్రదాయాలకు అనుగణంగా మట్టి ప్రతిమలనే పూజించాలి. అలా కాకుండా మారుతున్న కాలానుగుణంగా ఎన్నో ఆకృతులు, రంగురంగుల వినాయక ప్రతిమలు అందుబాటులోకి రావడంతో యువత వాటికి ఆకర్షితులై, మొగ్గుచూపుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలు పర్యావరణానికి హానికరమని తెలిసినప్పటికీ హంగులు, ఆర్భాటాలకు పోయి అధికంగా ఖర్చు చేసి మరీ వాటిని కొనుగోలు చేస్తుండడం విచారకరం.

మట్టి విగ్రహాలతో లాభాలు..

- సహజ సిద్ధంగా పొలాల్లో దొరికే బంకమట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం మంచిది. ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయి.
- మట్టి విగ్రహాల నిమజ్జనంతో నీటి వనరులకు ఎలాంటి నష్టం వాటిల్లదు.
- సహజ సిద్ధ రంగులతో తయారైన బొమ్మల ద్వారా జలచరాశులకు ఎటువంటి హాని కలగదు.
- రసాయనాలతో అనర్థాలు..
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు చెరువులు, నదుల్లో నిమజ్జనం చేసినా అవి కరగవు. వీటితో తయారైన ప్రతిమల్లో జిప్సం, గంధకం, మెగ్నీషియం, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ వంటి రసాయనాలు ఉంటాయి.
- వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువుల్లో జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది.
- రసాయనాలు కలిపిన నీటి మూలంగా చర్మవ్యాధులు వస్తాయి. శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారితీస్తుంది.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్ల సమయం పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపై కాలుష్య ప్రభావం పడుతుంది. ఇది జీవరాశుల మనుగడపై ప్రభావం చూపుతుంది.
- రసాయన రంగులు కలిపిన నీరు పంటపొలాలకు చేరడంతో దిగుబడులు తగ్గడమే కాకుండా ఆహార ఉత్పత్తులు కలుషితమవుతాయి.



ఇటువంటి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు స్వస్తి పలుకుదాం

మట్టి ప్రతిమల అచ్చుల పంపిణీ..

మట్టి వినాయక ప్రతిమల అచ్చుల పంపిణీకి స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా పంపిణీ చేపట్టనున్నారు. ప్రతీ ఏడాది మాదిరిగానే అచ్చులు విద్యార్థులకు అందించి, మట్టిబొమ్మలు తయారు చేయించడమే లక్ష్యంగా ముందుకువెళ్తున్నారు. వికాస తరంగిణి, వాసవీక్లబ్ మనరాజాం-సారధి సభ్యులు ఇప్పటికే అచ్చులు తయారు చేయించి, విద్యార్థులకు అందించేందుకు సిద్ధమయ్యారు.

పన్నెండేళ్లుగా అవగాహన కల్పిస్తున్నాం..



మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటు చేయాలని గత పన్నెండేళ్లుగా అవగాహన కల్పిస్తున్నాం. వినాయక ప్రతిమలకు సంబంధించి, అచ్చులను ప్రభుత్వ పాఠశాలలకు అందజేస్తున్నాం. తద్వారా విద్యార్థులతో మట్టి బొమ్మలు తయారు చేయించి, ఆయా కుటుంబాలకు పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి.

–టీటీవీ రమణమూర్తి,
వికాస తరంగిణి కేంద్ర సమన్వయకర్త, రాజాం.

సమాజ శ్రేయస్సుకు ఎంతో అవసరం..



వినాయక చవితిని ఎంతో ఆడంబరంగా జరుపుకుంటారు. ముందుగా మట్టి వినాయక ప్రతిమను కొనుగోలు చేసి పూజించడం సమాజశ్రేయస్సుకు ఎంతో అవసరం. ప్రతి ఒక్కరు మట్టి వినాయక ప్రతిమలను మండపాల్లో ప్రతిష్టించుకోవాలి.

–పి.వేణుగోపాల్,
భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, రాజాం.

మట్టి విగ్రహాలనే ప్రోత్సహిద్దాం..



మట్టివినాయక విగ్రహాలను ప్రోత్సహించాల్సిన అవసరం యువతలో ఎంతైనా ఉంది. దీంతో విగ్రహ తయారీదారులకు కూడా కొంత ఉపాధి లభిస్తుంది. రంగులతో తయారైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వైపు మొగ్గుచూపి, పర్యావరణానికి ఆటంకం కలిగించొద్దు.

–కొత్తా సాయిప్రశాంత్‌కుమార్,
రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, రాజాం.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి..



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడకం చేయడం ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అందరూ సహకరించాలి.

–డీటీవీ కృష్ణారావు,
కమిషనర్, రాజాం మున్సిపాలిటీ.

అప్పలనాయుడు మృతి పార్టీకి తీరనిలోటు

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



అప్పలనాయుడు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని కొండవలస పంచాయతీ మాజీ సర్పంచ్ బెవర అప్పలనాయుడు మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. అనారోగ్యం కారణంగా అప్పలనాయుడు(86) మృతి చెందగా, ఆదివారం జరిగిన ఆయన దహన సంస్కారాలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హాజరై ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉండి, పార్టీ బలోపేతానికి అప్పలనాయుడు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు గేదెల వెంకటేశ్వరరావు, రేగిడి, సంకిలి పీఏసీఎస్ అధ్యక్షులు వంజరాపు అశోక్ కుమార్, లావేటి వెంకటవేణుగోపాలనాయుడులు, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఎంతో మేలు



విద్యార్థితో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ప్రతి విద్యార్థీ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఎంతో మేలు కలుగుతుందని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం ఎంతో మంచిదన్నారు. పుస్తక పఠనంతో పాటు విద్యార్థులు కథలు చెప్పడం, రాయడం నేర్చుకోవాలని, చిత్రలేఖనంపై ప్రతి విద్యార్థీ దృష్టి సారించాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



బోర్ల మరమ్మతులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: మండలంలోని పెనుబాక, గార్రాజుచీపురుపల్లి, కంచరాం గ్రామాల్లోని పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు ఆదివారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌ల పర్యవేక్షణలో పాడైన బోర్లను బాగుచేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తుల సమాచారం మేరకు తక్షణమే వాటిని బాగుచేసి, గ్రామాల్లో తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా, పెనుబాకలో తాగునీటి బోర్ల మరమ్మత్తులను జెడ్పీటీసీ బండి నర్సింహులు పర్యవేక్షించారు.

'మన ఊరు-మన ఎమ్మెల్యే'



రేగిడి మండలంలోని బూరాడలో ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో మన ఊరు-మన గ్రామం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పర్యటించి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని అడగ్గా, పలువురు పలు చిన్నచిన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరనున్న బొజ్జ గణపయ్యలు



రామభద్రపురంలో బొజ్జ గణపయ్యలకు రంగులు దిద్దుతున్న మహిళలు

- రంగులద్దుతున్న కళాకారులు
- ధర రూ.వెయ్యి నుంచి రూ.20 వేలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద ఉన్న సత్యసాయిబాబా మందిరం.. శివాలయం పరిసర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు జోరుగా తయారవుతున్నాయి. సాలూరుకు చెందిన పలువురు ఇక్కడ విగ్రహాలు తయారుచేసి జీవనోపాధి పొందుతున్నారు. వివిధ రూపాలలో విగ్రహాలు తయారు చేస్తూ ఒక్కో విగ్రహం రూ. వెయ్యి నుంచి 20 వేల రూపాయల వరకు విక్రయిస్తున్నారు. గతంలో కరోనా మహమ్మారి కారణంగా విగ్రహాలు తయారు చేయలేకపోయామని, ఈ ఏడాది మాత్రం ఆర్డర్లు బాగానే ఉన్నాయని తయారీదారులు చెబుతున్నారు.

అనుమతులు తప్పనిసరి..

గణేష్ మంటపాల ఏర్పాటుకు పోలీస్ స్టేషన్, సచివాలయాల నుంచి అనుమతులు తీసుకోవాలని సీఐ ఎస్. తిరుమలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్ని రోజులు మంటపం నిర్వహిస్తారు.. ఎప్పుడు నిమజ్జనం చేస్తారో నిర్వాహకులు పోలీసులకు ముందస్తుగా తెలియజేయాలన్నారు.

ప్రజా సేవతోనే సామాజికవర్గాల ఉనికి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రజలకు సేవ చేస్తేనే సామాజిక వర్గాల ఉనికి మరింతగా వెలుగొందుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని కొప్పుల వెలమ కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుల సంఘాలు ప్రజలకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, కొప్పుల వెలమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సత్యనారాయణ, బలగ సాయికృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సజావుగా హిందీ పరీక్షలు



పరీక్షలు రాయడంలో నిమగ్నమైన విద్యార్థులు

రాజాం: మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న హిందీ పరీక్షలు ఆదివారం సజావుగా ముగిశాయి. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు సంబంధించి, 178 మందికి గాను 175 మంది హాజరైనట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూధనరావు తెలిపారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆనెం మహేశ్వరరావు ఇన్విజిలేటర్లుగా పాలవలస మధుసూదనరావు, పులఖండి బలరామ్మూర్తి, ఎస్.రామకృష్ణ, వెంకటరమణ, శారద, రూప తదితరులు వ్యవహరించారు. రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు, తెర్లాం, చీపురుపల్లి మండలాలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రాజాం: స్థానిక చీపురుపల్లి రోడ్డులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బొద్దాం ప్రబోధ సేవా సమితి, ఇందూ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా ఇక్కడి మండపంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నవరాత్రుల కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ ప్రవచనాలు, అభిషేకాలు, భగవద్గీత శ్లోకాల పఠనం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి బొద్దాం కమిటీ అధ్యక్షులు ముల్లు రామినాయుడు, కుప్పిలి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

బొబ్బిలి: మండలంలోని ఎం. బూర్జివలసలో కనకదుర్గాదేవి ఆలయ నిర్మాణానికి స్థానిక పెద్దలు శంకుస్థాపన చేశారు. బ్రహ్మజ్ఞులు నిర్ణయించిన ముహూర్తానికి ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. నిష్టల ధర్మారావు ఆధ్వర్యంలో పూజాధికాలు జరిగాయి. గ్రామ యువత, మహిళలు పాల్గొన్నారు.

ఆర్థిక బలోపేతమే లక్ష్యం ● ఎమ్మెల్యే శంబంగి



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా బలోపేతం కావడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కిలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరుకావడం వైఎస్సార్‌సీపీతోనే ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, సర్పంచ్ గంట పైడిరాజు, కార్యదర్శి పక్కి మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.